# 'అన్‌వాంటెడ్ ఛైల్డ్'

డాక్టర్ లక్ష్మి లోపలినుండి వచ్చే వరకు లత పరిశీలనగా గోడలన్నీ చూస్తూ కూర్చుంది. మూతిమీద వేలుంచుకుని ''సైలెన్స్ ప్లీజ్'' అంటోన్న నర్సుబొమ్మ మినహాయిస్తే మిగిలినవన్నీ పసిపాపల బొమ్మలే. లత ఆ గదినీ, ఆ బొమ్మల్నీ చాలాసార్లు చూసింది. కానీ ఇప్పుడెందుకో ఆ బొమ్మలు చాలా అసహనాన్ని కల్గిస్తున్నాయి. 'వెధవ బొమ్మలు' అని ఇరవై ఒకటవసారి విసుక్కున్నది.

''హాయ్ లతా! నువ్విక్కడే ఉన్నావా?'' అంటూ లక్ష్మి లోపలినుండి వచ్చింది.

''పరీక్ష చేశావుగా! రిజల్ట్ తెల్పుకోకుండా ఎలా వెళ్తాను?'' అనుకుంది లత. ఆ భావననే చూపులతో వీలయినంత ఎక్స్‌ప్రెస్ చేసింది. లక్ష్మి కుర్చీ జరుపుక్కూర్చుని లత కుడిచేతిని తన రెండు అరచేతుల మధ్య నొక్కి చాలా కృత్రిమంగా ''కంగ్రాట్యులేషన్'' అంది. లక్ష్మి చేతుల మధ్య చేయి మంచుగడ్డలా చల్లబడింది. రోజుకి రెండు చొప్పున రిలీజయ్యే తెలుగు, హిందీ సినిమాలు, వారానికి మూడు చొప్పున మార్కెట్టుకు వచ్చే నవలలు ఆ మాటను అర్థం చేసుకోవడానికి కావలసిన 'జనరల్ నాలెడ్జి' నిచ్చేయి లతకి.

''ఈజిట్?'' అంది. కంఠం—ఎంత నిగ్రహించుకున్నా—సన్నగా వణికింది. 'ఇటీజ్' అనటానికి లక్ష్మికి నోరు రాలేదు. తలను చిన్నగా వూపి ''ఈసారి అబార్షన్, గాడిద గుడ్డూ అంటూ నన్ను 'హెరాస్' చెయ్యొద్దు. సంవత్సరానికి మూడు చొప్పున అబార్షన్స్ అయితే తర్వాత అబార్షన్ చేయించుకుందుకు నువ్వుండవ్. మ్యారీ హిమ్ ఐసే మ్యారీహిమ్'' అంది. ''మ్యారీ హూమ్? ఎవర్నని?'' అనుకుంది లత బయటికి వచ్చేస్తూ.

* * *

తలుపు మీద నాక్ గత అయిదు నిమిషాలుగా వినవస్తూనే ఉంది. లత కదలటం కానీ తాను కప్పుకున్న దుప్పటి తీయటం కానీ, రెస్పాన్స్ ఇవ్వటం కానీ చేయలేదు. అయిదు నిమిషాల తర్వాత తనే తలుపు తీసుకుని లోపలకు వచ్చేడు రమేష్. షాండిలియర్‌నే తదేకంగా చూస్తోన్న లతని చూసి ''నువ్వు మెలకువగానే ఉన్నావా?'' అన్నాడు. అవసరమయిన దానికంటె ఎక్కువ ఆశ్చర్యపోతూ.

''ఇతరుల గదిలోనికి వాళ్ళ అనుమతి లేనిదే రాకూడదని తెలీదూ?'' అని కసిరింది అతనితో మాట్లాడకూడదనే తన నిర్ణయాన్ని తాత్కాలికంగా మరిచి.

''ఏమిటీ లక్ష్మి అంటోంది.''

''దాని బొంద'' అంది కసిగా.

''అబార్షన్ కుదరదు అంటోంది...'' చాలా నంగిగా అన్నాడు.

''అది కాకపోతే దాని బాబులాంటి వాళ్ళున్నారు సిటీలో. నాకు చెప్తుందా అబార్షన్ గురించి?''

''నిజమే. ఆవిడ చేసిన అబార్షన్స్ కంటె నువ్వు చేయించుకున్న అబార్షన్ల సంఖ్యఎక్కువ'' అనుకున్నాడు మనసులో రమేష్ ఏవగింపుగా.

''మూడవ నెల దాటకపోతే ప్రమాదం ఏమీ లేదు. కానీ ఆ బ్లీడింగూ... ఆ పెయిన్... ఓహ్ గాడ్!''

''అవునంతే. జనరల్‌గా ప్రమాదం ఏమీ ఉండదు. కానీ నీ ఆరోగ్యం అందుకు అనుకూలంగా లేదట. ప్రాణానికి ప్రమాదం... అంటోంది'' చివరిమాట లక్ష్మి అనలేదు. రమేష్ కల్పించాడు. ఈ మాటతో లత కొంచెం జంకింది. ఆలోచనలో పడింది. రమేష్‌కి ఇంతకంటె మంచి అవకాశం రాదనిపించింది. పోనీ పెళ్ళి... పెళ్ళి చేసుకుందామా?'' అన్నాడు ధైర్యం చేసి. నొసలు ముడివేసి, 'మతిగానీ పోలేదు గదా' అన్నట్టు చూసింది. ఆ మాత్రానికే రమేష్ గుండె మోకాళ్ళలోకి వెళ్ళనల్పిందే... కానీ అతనీ 'యిష్యూ'ని ఇంత తేలికగా వదలదల్చుకోలేదు. కార్య శూరుడని పేరతనికి. ఆఫ్టరాల్ ఒక ఆడదాని మెళ్ళో తాళి కట్టడానికి నాలుగేళ్ళు 'టైం' తీసుకున్నాడంటే తన 'కార్య శూరత్వం' మీద తనకే అనుమానం వేస్తోంది.

ఈ విపత్తుకు చాలా విచారిస్తున్నవాడిలా, ఆ ఆపదనుండి లతను తప్పించేటందుకు శాయశక్తులా ప్రయత్నిస్తున్నవాడిలా సీరియస్‌గానటిస్తూ నడుచుకుంటూ వెళ్ళి కిటికీతెర ప్రక్కకు లాగి క్రింది తోటలోకి చూస్తూ ''ఫర్ ఎ ఛేంజ్...'' అని నసిగాడు. అయిదు నిమిషాలకు ఒక ఫ్యాషన్‌ని అభిలషించే లతకి ఈ మాట చాలా నచ్చేసింది 'నిజమే! ఇరవై ఏడేళ్ళు తనకి, 'ఫర్ ఏ ఛేంజ్' పెళ్ళెందుకు చేసుకోకూడదూ? ఇన్నాళ్ళూ 'స్టెపినీ' అనుకుంటోన్న ఈరమేష్‌గాడిక్కూడా బుర్ర ఏడ్చిందే! ముఖాన్ని కుడిభుజం మీదకి తిప్పి కనుకొలకులగుండా ఆమె ముఖభంగిమల్ని కనిపెట్టిన రమేష్ ఒక్క అంగలో వచ్చి ఆమె మంచం మీద పడ్డాడు.

''నువ్వు 'ఫర్ ఏ ఛేంజ్, ఫర్ ఏ ఛేంజ్' అంటూ ''కండోమ్స్ వాడకపోవటం ఈ ఛేంజ్ కోసం కాదు కదా'' అంది అతని ముఖంలోకి అనుమానంగా చూస్తూ.

''దొంగ రాస్కెల్, చాలా తెలివిగలది'' అన్పించింది రమేష్‌కి. ''డోంట్ బీ సిల్లీ లతా! ఇన్ని అబార్షన్లు అయినాయి. ఎప్పుడయినా ఈ మాట అన్నానా? ఇప్పుడంటే డాక్టర్లు వద్దనబట్టిగానీ...'' అంటూ ఉదారంగా అన్ని అబార్షన్ల పాపభారం తన మీదనే వేసుకున్నాడు.

లత రమేష్ మాటలు నమ్మలేదు. ''వీడు నన్నేంచేయగలడులే'' అనే ధైర్యంతో పెళ్ళికి 'యస్' అంది. ''అది సరే రమెష్! ఫర్ ఏ ఛేంజ్ అనుకుని పెళ్ళి చేసుకుంటావనుకో. ఈ కడుపు మాటేమిటి?'' తనను తానే ఏవగింపుగా చూసుకుంటూ అంది. ''ఫర్ ఏ ఛేంజ్' అనుకుని ఈ దరిద్రాన్ని ఇంకో ఆరు నెలలు మోయటం, ఫర్ ఏ ఛేంజ్ అని ఆ మురికినీ, రొచ్చునీ భరించటం మాతృప్రేమలాంటి బరువయిన మాటల కోసం 'బ్రెస్ట్ ఫీడింగూ...అయ్ హేట్ ఆల్ దిస్ న్యూసెన్స్''

''ఆ! నువ్వు పెంచాలేమిటి పిల్లవాణ్ణి...''

''పెంచనక్కర్లేదు సరే. కానీ కనాలి కదా!''

''నువ్వు కనక్కర్లేదు. అందామంటేప్రకృతీ, సైన్సూ రెండూ ఒప్పుకోవని తెల్పి నోర్మూసుకున్నాడు.

* * *

అన్నీ తన ప్లాను ప్రకారమే జరుగుతున్నందుకు రమేష్‌కి సంతోషంగా ఉంది. చివరకు తాను అనుకున్నది సాధించాడు. రంగారావుగారి ఏకైక

వు(త్రిక మెడలో తాళి కట్టేడు. ఆస్తికి హక్కుదా రయివాడు. 'నా గమ్యం సాధించాను'అనుకున్నా డతను గర్వంగా.

ఉదయమే పెళ్ళిని రిజిష్టర్ చేయించారు. సంఘం దృష్టిలోనూ, చట్టరీత్యాను భార్యా




భర్తలుగా నమోదయినారు. 'ఇక ఎన్ని సార్లు కడుపులయినా, అబార్షన్స్ అయినా వ(రీ అవ వక్కర్లేదు' అన్పించింది లతకి. ఇది వరకు 'వ (రీ' అయిందని కాదు. డాక్టర్ వద్దకు వెళ్ళడం. పరిస్థితిని వాళ్ళకువివరించటం, వాళ్ళమాపులు, ఆ (ప్రోసెస్... అదంతా బోర్! పరమ బోర్!'

* * *

తొమ్మిది నెలలపాటు లత గర్భం పట్టుకుని వేళ్లాడి వేళ్లాడీ ఏ విధమైన మందులకీ లొంగక, మృత్యువుతో పోరాడి ఈ భూమ్మీదికి వచ్చాడు బాబు. సినిమాల్లో పాపాయిలా పదిహేను పౌన్ల బరువుతో, దబ్బపండు ఛాయలో లేడు. సన్నగా, పీలగా, నల్లగా ఉన్నాడు. తలమీద ఒక్క వెం(టుక కూడా లేదు. 'అబ్బ! ఎంతహారిబుల్ గాఉన్నాడో' అనుకుంది లత. 'పోన్లే పుట్టాడు కదా అని అదేదో నవల్లోలా మన బాబుని చూడండి అని రమేష్ కళ్ళల్లోకి (ప్రేమగా చూద్దామన్నా ఆ మా(త్రం 'ఏక్షన్' కూడా కుదిరేలా లేదు, వీడి రూపు చూస్తోంటే' అని విసుక్కుంది.

"అబ్బ! నల్లగా, కోతిలా ఉన్నాడు. ఎవడై ఉంటాడా వీడి తం(డ్రి అనుకున్నాడు గానీ వెంకటేశ్వ(రావుగాడే అయుంటాడు. కనీసం లత రంగయినా రాలేదే?" అని చికాకు పడ్డాడు రమేష్. బాబు పుట్టుకకు మనఃస్ఫూర్తిగా ఆనందించిన వాడు రంగారావు గారొక్కరే. "వాడి తం(డ్రెవరో ఆ తల్లికి కూడా తెలియకపో వచ్చును. కానీ వాడిలో తన రక్తం ఉంది. అది చాలు" అనుకున్నాడాయన.

* * *

ఇరవై రోజుల తర్వాత బాబుకి స్పృహ తెప్పించే రు డాక్టర్లు. "మెంటల్ గా దెబ్బతిన్నాడు" అన్నారు స్పెషలిస్టులు. ఎప్పుడయినా ఒకటే మాట అడిగేవాడు. "ఆయమ్మేది?" అదీ రమేష్ నే అడిగేవాడు.

"ఆ ఆయమ్మెవరో పిలిపించరాదూ? ఏమ యినా ఇం(ప్రూవ్ మెంట్ కనపడుతుందేమో" అనేవారు డాక్టర్లు. కానీ ఆయమ్మేదీ! ఆమె ఏమయిందో ఎవరికీ తెలీదు. ఎక్కడికెళ్ళిందో ఎప్పుడొస్తుందో, అస్సలు వస్తుందో, రాదో! ఎవ్వ రూ తెల్సుకోలేని చోటకు వెళ్ళి పోయింది. లత మొగుణ్ణి అనుమానంగా చూస్తుంది. ఒకటి రెండుసార్లు అడిగింది కూడా.

"నువ్వేమయినా కక్కుర్తి పడ్డావా రమేష్?"

"ఛీ లతా! వ్వాట్ నాన్సెన్స్ ఆర్ యూ టాకిం గ్? సౌందర్యాధి దేవతలాటి నిన్ను పక్కన పెట్టు కుని ఆ నల్లరాతి వి(గ్రహమే కావల్సి వచ్చిందా నాకు?"

రమేష్ మాటలకు లత మురిసిపోలేదు. ఆమె బుగ్గల మీద సిగ్గులు మొగ్గలెయ్యనూ లేదు. ఏం పంది పిల్లలాంటి రాధా రాణి కావలసి రాలేదూ? దానికంటె రాజమ్మ వేయిరెట్లు అందమైనది! అనుకుంది. గొప్పవాళ్ళ మనసులు మాటల్లో బహిర్గతం కాలేదు.


** ** **

ఇప్పుడు బాబుది వేరే లోకం. వాణ్ణి చాలా అనాధశరణాలయాలకు తిప్పింది లత. పెద్ద మొత్తం విరాళాలని ఎర చూపింది. కానీ తల్లీ తం(డ్రీ వున్నవాడిని శరణాలయంలో చేర్చుకునేం దుకు ఎవరూ ముందుకు రాలేదు.

"సరస్వతీ బాల విహార్ పేరుమీరు వినేవుం టారు" అంది వచ్చినావిడ పెదవుల రంగుని నాలుకతో అద్దుకుంటూ, లత ముఖంలోని భావాలను పరిశీలిస్తో.

"విన్లేదు" అన్నది లత నిర్మొగమాటంగా

కాళ్ళకూరి కృష్ణ




బొమ్మ కుక్కతో ఆడుకుంటూ.

"మేము మా సంస్థని పదిసంవత్సరాల క్రితమే ప్రారంభించాము. ఎటువంటి మొద్దు పిల్లలయినా దారిలోకి రావల్సిందే. అసలు..."

"ఇంతకూ ఏమంటారు?' లత లేచినిలబడింది.

"మీకు తోచిన విరాళం...

"అయామ్ సారీ"

లత టీపాయ్‌మీది మాగజైన్ తీసి చూస్తోంది. సరస్వతీ బాలవిహార్ సెక్రటరీ నమస్కారం చేసి వెనుతిరిగింది. ఆమెతోపాటు మిగిలిన వారూ లేచారు.

"చూడండి"

ఆమె ఆగింది. మిగిలిన వాళ్ళూను.

"కూర్చోండి"

లత గోళ్లరంగు గికుతూ చాలా నెమ్మదిగా సిగ్గుపడుతున్నట్టు ప్రారంభించింది.

"మా దగ్గర ఒక అబ్బాయి వున్నాడు. చదువులోనూ, లౌకిక విషయాల్లో కూడా వాడిని మీరు దారిలోకి తేగలరో, లేదో నాకు తెలియదు. కానీ వాడిని మీ హాస్టల్‌లో వుంచుకోవాలి. నెలనెలా అడ్వాన్సుగా బిల్ పే చేస్తాను. మీ బాలవిహార్‌కి అయిదువేలు విరాళంయిస్తాను. యిప్పుడు మీ 'పెర్‌ఫార్మన్స్' 'శాటిస్‌ఫాక్టరీ'గా వుంటే యింకో అయిదువేలు యిస్తాను."

సెక్రటరీ దిగ్భ్రమ చెంది చూస్తోంది. ఆమె చూపులు లతకు ఇంకోలా అర్థం అయ్యాయి.

"చూడండి. ఈ ఇంటి వాతావరణం. మా యిద్దరికీ తీరదు. హి యీ ' జ్ ఎ బిజినెస్ మేన్ అండ్ అయామ్ ఎ సోషల్ వర్కర్ ద ఛైల్డ్ మే గెట్ స్పాయిల్డ్ అది 'అవాయిడ్' చేయటానికి ....."

"యస్. యస్ మేడమ్! అయ్‌కెన్ అండర్‌స్టాండ్ యువర్ డిఫికల్టీ."

లతకి కావల్సింది రాజేష్ తనకంటికి ఎదురుగా లేకపోవటం సరస్వతీబాయికి కావల్సింది తమ సంస్థకు విరాళం.

"చూడండి. మిసెస రమేష్ వంటివారు నూటకి ఒకరుంటారు. పూటగడవకపోయినా పిల్లలు తమకంటికి ఎదురుగానే వుండాలనుకుంటారు కొందరు మూర్ఖులు. షి ఈజ్ నాట్ లైక్ దట్. దో షి ఈజ్ ఎ మల్టీ మిలియనీర్, డిసిప్లిన్ కోసం పిల్లవాణ్ణి తమ వూళ్ళోవుండి కూడా హాస్టల్‌లో వుంచుతున్నారు" అన్నది సరస్వతీబాయి మిగిలిన స్త్రీలతో. అది అబద్ధమని సరస్వతీ బాయికి తెల్సు. లతకీ తెలుసు. మిగిలిన వాళ్ళకు తెల్సు. అయినా అందరూ చిరునవ్వులు చిందించారు. సభ్యత!

** ** **

బాబుకు తెల్లవారింది సరస్వతీ బాలవిహార్‌లో వాడి కళ్ళముందు నిరంతరమూ ఆయమ్మే మెదులుతోంది. 'ఆయమ్మా' ఆయమ్మా! అని వాడి పసిమనసు ఆక్రోశిస్తున్నది. ఆయమ్మ కావాలి. కానీ లేదు. ఆయమ్మ అంతర్ధానానికి, తండ్రి ప్రవర్తనకు ఏదో సంబంధం వూహిస్తున్నది ఆ చిన్నారి హృదయం. తండ్రి తనను బలంగా తోసేయడం మస్తిష్కంలో మెదులుతోంది. మెట్లమీద నుండి కిందపడ్డ భావన.

"ఆయమ్మా!" బాబు హృదయ విదారకమయిన కేకతో హాస్టలుదద్దరిల్లింది.

"యు ఆర్ స్టిల్ హియర్" అంటూ వచ్చింది వార్డెన్ బెత్తంతో. ఆయమ్మలాగే తెల్ల బట్టలతో ఎంతో నిర్మలంగా కన్పిస్తోంది. ఆయమ్మ కాదని తెల్సు. కాని ఆ పసిమనసుల ధవళ వస్త్రాలకు ఏ ఔన్నత్యాన్ని ఆపాదించుకున్నదో— పరుగెత్తుకు వెళ్ళి ఆమె చీరెకుచ్చిళ్ళలో ముఖం దాచుకున్నాడు. మరుక్షణంలో గది గుమ్మం ముందు పడ్డాడు ఆమె తోసిన తోపుకి. నాన్నలాగే రాక్షసంగా.....తిరస్కారం వాడిచూపులో.

"లే లేచి బ్రష్ చేయి." అని ఆమె హూంకరించింది.

సమాధానం లేదు.

"విన్నే లేవమనేది"

"..............."

"లేవవా?...."

"..........."

"పది లెక్కించేలోపున లేవాలి"

"..........."

"ఒకటీ......రెండూ...."

పదిక్షణాలు గడిచేక ఆమె చేతిలోని బెత్తం వాడి కాళ్ళమీదా, చేతులమీదా, వీపుమీదావిలయ తాండవం చేసింది. బ్రష్ చేసుకొచ్చిన పిల్లలందరూ అటువంటి దృశ్యాలు అలవాటే అయినా అంతకంటే వినోదం మరేదీ ఆ ఆవరణలో లభించనందుకు దానినే పరమాద్భుతంగా చూస్తున్నారు.

"చిల్డ్రెన్! గో టు యువర్ ప్లేసెస్. ది సీజ్ ఎ వార్నింగ్‌ఫర్ యూ!" ఆమె బెత్తం విసిరేసి వెళ్ళిపోయింది. బాబుకి కళ్ళు మూతలు పడుతున్నాయి. నిద్ర ఆయమ్మలా చల్లగా వాణ్ణి కౌగిలించుకున్నది.

** ** **

"నేనుఇంటికి పోతాను" అన్నాడు బాబు వాళ్ళ దెబ్బలకు తట్టుకోలేక.

"షటప్! నీకు ఇదే ఇల్లు. ఇదే వాకిలి. లే డైనింగ్ హాలుకి నడువు" అంది వార్డెన్, వాడు ... ఎగురవేసి వూరుకున్నాడు.

"డైనింగ్ హాలుకి వస్తావా? రావా?"

'నీకు సమాధానం చెప్పాలా?' అన్నట్టు తిరస్కారంగా చూసేడు. వాడి లేత వీపు మీద బెత్తం తిరిగి నాట్యం చేసింది. రాజేష్‌కి యూనిఫారం వేశారు. పుస్తకాలు చేత పట్టించారు. క్లాసులో కూర్చోబెట్టారు. వార్డెన్ దెబ్బలు వాడి లేత శరీరాన్ని మంటలెత్తిస్తున్నాయి. వాడు విర్లిప్తంగా రోడ్డువైపు చూస్తూ కూర్చున్నాడు. రోడ్డుమీద ఒక ఆడమనిషి తెల్ల బట్టలు ధరించి వెళుతోంది. రాజేష్ "ఆయమ్మా!" అంటూ మెరుపులా క్లాసులో మాయమై రోడ్డుమీద ప్రత్యక్షమయినాడు. వాడి వెనుకే క్లాసు టీచరు అరుచుకుంటూ వచ్చి ఆ విషయం సరస్వతీ బాయికి చెప్పింది. ఆమె వెంటనే గేట్ కీపర్‌ను పంపింది. పదిహేను నిమిషాల పాటు అతన్ని ముప్పతిప్పలు పెట్టి చివరకు రాజేష్ దొరికిపోయేడు. శిక్షగా వాడిని ఎర్రటి ఎండలో కాలే ఇసుకలో మోకాళ్ళమీద నిలబెట్టేరు. తలలోనుండి చెమట, కన్నుల్లోనుండి నీరు ఏకమై

కారుతున్నాయి వాడి ముఖం మీద.

"చూసేరా యిస్కూల్ డిసిప్లిన్? ఇక ఆపిల్లవాడెపుడూ బయటకు పోవటానికి ప్రయత్నించడు. అందుకే మాపిల్లల్ని ఇక్కడ చేర్పించేను." అంటోంది— పిల్లలను కనడమే కానీ పెంచడం తెలియని, డిసిప్లిన్ అంటే యంత్రాల్లా టైముకి పనిచేయటమేనని, అది పిల్లల ఎదిగే మనస్సులను చంపి వాళ్ళ స్వంత తెలివి తేటలను పని చేయకుండా చేసి, సర్కస్ సింహాల్లా వాళ్ళను హింసించి అయినా సరే వాళ్ళకు చదువు నేర్పాలనుకునే ఒక మూర్ఖురాలు తన స్నేహితురాలితో.

** ** ** **

బాల విహార్ వాళ్ళశిక్షలు రాజేష్‌మీద ఏం పనిచేసినాయోతెలియదు. వాడు ఏ తెల్ల చీరె కన్పించినా వాళ్ళనీ శిక్షను లక్ష్యపెట్టక రోడ్డు మీదకు వెళ్తూనే వున్నాడు. ప్రాణాలకు తెగించి ఆ ట్రాఫిక్‌లో నుండి దూసుకుపోతూనే వున్నాడు. గేట్ కీపర్‌కు వాణ్ణి వేటాడి తీసుకు రావటం డ్యూటీలో ఒక భాగం అయిపోయింది. ఆ కారణంగా తన జీతం పెంచమని అతను సరస్వతీబాయిని అడగాలనుకుంటున్నాడు. సరస్వతీ బాయి, వార్డెను వాడిని హింసించి, శిక్షించి హాస్టలులో నిలుపుకోవాలని తాపత్రయపడుతూనే వున్నారు.

ఆ ఇంటిలో...ఆ పెద్ద భవనంలో వాడి స్థానమేమిటో వాడికి తెలియదు. మరీ చిన్నప్పుడు ఆ ముసలాయన—వాడి తాతగారు చూపించిన ఆప్యాయత వాడి చిన్ని మస్తిష్కంలో 'రికార్డ్' అవనేలేదు. వాడి సర్వస్వమూ ఆయమ్మే. అమ్మా నాన్నగా అని వాడికి ప్రపంచం పరిచయం చేసిన వ్యక్తులిద్దరూ ముఖం కన్పిస్తే చాలు చావచితక్కొట్టేవాళ్ళు. కానీ తనగదిలో ఆయమ్మ ఒడిలో వాడికి చాలా బావుండేది. ఆయమ్మ పళ్ళు తోమేది, నీళ్ళు పోసేది, బీరువా తెరిచి"రాజీబాబు ఇవ్వాళ ఏం బట్టలు వేసుకుంటారో" అనేది. వాడు ఎన్నుకున్నబట్టలు వేసేది. చందమామను చూపించి ఎన్నెన్నో పాటలు పాడింది. తోటలో వాడితో ఎన్నో ఆటలు ఆడింది. ఆయమ్మ...ఆయమ్మ వస్తే ఎంత బావుంటుందీ! కానీ...ఎలా వస్తుంది. గేటులో నుండి వాడి చూపులు ఎప్పుడూ రోడ్డు మీదనే వుంటాయి. ఆయమ్మ అటు వెళ్ళినట్టు తను వెళ్ళి ఆయమ్మచీరె కుచ్చిళ్ళు పట్టుకున్నట్టు, ఆయమ్మ తనను ఎత్తుకుని రెండు బుగ్గలూ ముద్దులతో నింపి....ఎప్పటికీ నిజం కాని ఎన్నో కలలు వస్తాయి వాడికి.

జరిగిన దేమిటో, జరుగుతున్న దేమిటో అర్థం కాక వాడుపిచ్చెత్తి పోతున్నాడని ఈ నరరూప రాక్షసులకు ఎలా ఎలా తెలుస్తుంది?

** ** ** **

సంకెళ్ళు వూడదీసి, మేకుకి తగిలించి "పదస్నానికి" అంది పనిపిల్ల బాబుని బాత్‌రూమ్స్ వైపు ఒక్కతోపు తోసి. పుళ్ళు పడినకాళ్ళు నడవటానికి మొరాయిస్తున్నాయి. "త్వరగా నడువూ" అని వీపుమీద ఒకటి వేసిందా అమ్మాయి. తన శరీరం మీద వాడికె మాత్రమూ 'ఇంటరెస్ట్' లేదు. అసలది తన శరీరమే నన్న స్పృహలేదు.

కాళ్ళీడ్చుకుంటూ యధాలాపంగా నడుస్తున్న వాడి కళ్ళుతారల్లా తళుక్కుమని మెరిసేయి. గేటు తెరిచి వుంది. గెటు కీపర్ లేదు. మరుక్షణం వాడు రోడ్డుమీదున్నాడు—అంత బాధానిమయిందో తెలీదు.

ఒక్కసారిగా హాస్టల్‌లో సంచలనం రేగింది. సరస్వతీ బాయి వెర్రెత్తిపోయింది. బంగారు గుడ్లుపెట్టే బాతువాడు. వాడు తప్పించుకుపోయాడా నెలకి రెండువందల రూపాయల ఆదాయమూ, మిగిలిన విరాళమూ బంద్! బాబువెనకాల గేట్ కీపర్ పరుగెత్తుతున్నాడు. బాబుకి ముందు విశాలప్రపంచం పిలుస్తోంది. ఈ ప్రపంచంలో ఎక్కడో అక్కడ ఆయమ్మ కన్పిస్తుంది. తను దొరికేడా? మళ్ళి సంకెళ్ళు....పుళ్ళు....వాళ్ళు పెట్టే చిత్రహింసలు... జైలులాంటి హాస్టలు. స్వాతంత్ర్యం కోసం ఎందరో

ప్రాణాలకు తెగించి పోరాడేరు. ఆ విషయం వాడికి తెలియకపోయినా అందుకే పరుగెత్తుతున్నాడు. లారీలు, బస్సులూ, కార్లూ, రిక్షాలు వేటినీ లెక్కచెయ్యకుండా—కాళ్ళ మీద సలుపుతున్న పుళ్ళ బాధను పళ్ళ బిగువున పట్టి, కడుపులో కరకర మంటోన్న ప్రేగుల ఆకలి కేకలను కూడా లక్ష్యపెట్టక వెనుక గేట్ కీపరు...జైలువంటి హాస్టలు. ముందు ఆయమ్మ... చల్లని ఆమె ఒడి! నాన్న ఆయమ్మనేమీ చేయక ముందు ఆయమ్మ వుండేది. ఎంత చక్కనికథలు చెప్పేది. ఆ కథల్లో రాకుమారుడు తనే. పెరుగన్నం తింటే చందమామ దగ్గరకు వెళ్తాడన్న మాట. చందమామలోకి వెళ్ళి...ఆ...వెళ్ళి...

"ఆయమ్మా!" హృదయ విదారకమయిన కేక. రాజేష్‌ని గుద్దిన లారీమాత్రం దుష్ట ప్రపంచానికి ప్రతినిధిలా ఠీవిగా రొదచేసుకుంటూ వెళ్ళిపోయింది. ఒక్క క్షణం క్రితం నిర్విరామంగా నడిచిన ట్రాఫిక్ ఆకేకకు భయపడి నిల్చిపోయిందా అన్నట్టు స్తంభించిపోయింది.

గేటు కీపరు "చచ్చేడా నిదు" అని వంగి చూసేడు దగ్గరకు వచ్చి బాబు ఆత్మ అప్పటికే ఈ బంధాలనుండి విముక్తి చెంది ఆయమ్మతో చందమామ కావల కబుర్లు చెప్తోంది.

గర్భవిచ్ఛిత్తికి మందులూ, మాకులూ మింగీ మింగీ వాడి భౌతిక రూపాన్ని వికృతం చేసిన ఆ తల్లిని ఎవరు శిక్షిస్తారు? పశువులా, కామవాంఛతో

కన్నూ మిన్నూ గానక గాజుపలక వంటి వాడి హృదయాన్ని పగులకొట్టి వాడి మానసికారోగ్యాన్ని వినాశనం చేసిన వాడి తండ్రిని ఏ న్యాయస్థానం శిక్షిస్తుంది? ధనం కోసం...కేవలం ధనం కోసం వాడి ప్రాణాలతో జూదమాడిన సరస్వతి బాయి కి యీలోకంలో శిక్ష లేనేలేదు. ఎందరో దోషులు శిక్షలు అనుభవించకుండానే తప్పించుకు తిరుగుతున్నారు.

